
సాక్షి
పల్నాడు
శుక్రవారం । 27 । జూన్ । 2025



ప్రత్యేక పూజలు

నాదెండ్ల: గణపవరంలో కొలువైయున్న కోదండ రామస్వామి ఆలయంలో గురువారం ఏపీ పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్ జి.బ్రహ్మయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 514.30 అడుగుల వద్ద ఉంది. ఇది 139.0872 టీఎంసీలకు సమానం.

వారాహి అలంకరణలో బగళాముఖి



చందోలు(కర్లపాలెం): వారాహి నవరాత్ర మహోత్సవాలలో భాగంగా చందోలు గ్రామంలోని బగళాముఖ అమ్మవారికి వారాహి అమ్మవారి అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూలు, పండ్లు సమర్పించారు.

న్యూస్‌రీల్

శ్రీవారిని దర్శించుకున్న హంపి పీఠాధిపతి



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో బృందావన శ్రీనివాసుడిని గురువారం హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతీ మహాస్వామి దర్శించుకున్నారు. ఆలయ పాలక మండలి సభ్యులను, భక్తులను ఆయన ఆశీర్వదించారు. కార్యక్రమంలో బొల్లేపల్లి సత్యనారాయణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శులు ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టా ప్రభాకరరావు, ఆలయ అర్చక స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టర్ సాదియాకు బంగారు పతకం



మంగళగిరి: ఈ నెల 22వ తేదీ నుంచి కర్ణాటకలో జరుగుతున్న జూనియర్ నేషనల్ ఎక్యూప్డ్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన సాదియా అల్మాస్ బంగారు పతకం కైవసం చేసుకున్నారు. ఈ మేరకు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు , షేక్ సంధానిలు గురువారం తెలిపారు. 57 కేజీల స్క్వాడ్ విభాగంలో 200.5 కేజీలు, డెడ్ లిఫ్ట్‌లో 185.5 కేజీలు బరువులు ఎత్తి ఆల్మాస్ రికార్డు సృష్టించారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆల్మాస్‌ను పలువురు అసోసియేషన్ ప్రతినిధులు అభినందించినట్లు వెల్లడించారు.

మొహరం వేడుకలు ప్రారంభం



పొన్నూరు: మొహరం పండుగ వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. హజరత్ మొహమ్మద్ వారి మనుమలు హజరత్ ఇమామే హసన్, హజరత్ ఇమామే హుస్సేన్ త్యాగాలను స్మరిస్తూ పట్టణంలోని మొల్లా దొహరా మసీదు వద్ద పీర్ల చావిడిలో పీర్లను పూలతో అలంకరించారు. మేళ వాయిద్యాలతో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మొల్లా హైదర్, మొల్లా గబ్బర్ బాషా, మొల్లా సంధాని, మొల్లా నజీర్, మొల్లా ఖలీల్ బాషా, మొల్లా జలీల్, మొల్లా బాజి, మొల్లా నసీర్, మొల్లా రహంతుల్లా, షేక్ గౌస్, మొల్లా అసద్, మొల్లా అర్షద్, మొల్లా ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు. మొల్లా కరీమ్ పర్యవేక్షించారు. జూలై 4వ తేదీ వరకు వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

డీడీఏగా నాగేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖ ఉప సంచాలకులు (డీడీఏ)గా ఎ.నాగేశ్వరరావు గురువారం జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నాగేశ్వరరావు వైఎస్సార్ కడప జిల్లాలో డీడీఏగా పనిచేస్తూ బదిలీపై గుంటూరు వచ్చారు. ప్రస్తుతం గుంటూరు జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు(జేడీఏ)గా పనిచేస్తున్న యు.నరసింహారావు ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ చేయనున్నారు. నరసింహారావు రిటైర్ అయ్యాక ఎ.నాగేశ్వరరావు ఆయన స్థానంలో కొనసాగనున్నారు.

సత్య సాయిబాబా ప్రచార రథానికి స్వాగతం



తెనాలి: పుట్టపర్తిలోని శ్రీ సత్య సాయిబాబా ఆశ్రమ ప్రస్థానం 75 ఏళ్లకు చేరుకుంటున్న సందర్భంగా ప్రత్యేక ప్రచార రథం రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తోంది. శ్రీసత్య సాయిబాబా బోధనలను ప్రచారం చేస్తోంది. ఆ క్రమంలో బుధవారం రాత్రి తెనాలి వచ్చిన ప్రచార రథానికి ఘనస్వాగతం లభించింది. భక్తులు పలువురు హారతులిచ్చి, ప్రత్యేక పూజలు చేశారు. విశ్రాంత పోలీసు అధికారి విశలేశ్వర్, కుమార్ పంప్స్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఛీ.. మిర్చి!

మిరప సాగుకు రైతుల పెదవి విరుపు

ఎర్ర బంగారంగా పిలుచుకునే మిర్చిని సిరుల పంటగా విశ్వసిస్తారు. అయితే కూటమి సర్కారు తీరుతో ఈ ఏడాది మిర్చి రైతుకు ఘాటు తగిలింది.. ఫలితంగా నేడు జిల్లాలో మిర్చి సాగు చేసిన ఏ ఒక్క రైతు ఇంట ఆనందం లేదు. ధర పతనంతో రైతు కుదేలు కాగా.. ఆదుకుని 'మద్దతు'గా నిలవాల్సిన ప్రభుత్వం గాలికొదిలేయడంతో వారి పరిస్థితి అగమ్యగోచరమైంది. దీంతో నేడు మిర్చి పంట వేసేందుకు రైతులు భయపడాల్సిన దుస్థితి. ఇప్పటికే రూ.లక్షల్లో నష్టపోయిన తాము ఇప్పట్లో మిర్చి జోలికి పోమని తెగేసి చెబుతున్నారు.

- మిరప విత్తనాలు కొనేవారే లేరంటున్న వ్యాపారులు
- ఇప్పటివరకు మిర్చి నారు పోయని నర్సరీ యజమానులు
- గతేడాది భారీ నష్టాన్ని మిగిల్చిన పంట
- ధరలు అమాంతం పతనమైనా పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ప్రత్యామ్నాయ పంటల వైపు రైతుల చూపు
- జిల్లాలో 57 వేల హెక్టార్లలో సాగు అంచనా వేసిన ఉద్యాన శాఖ అధికారులు



సాక్షి, నరసరావుపేట: మిర్చి పంట సాగుకు రైతులు వెనుకాడుతున్నారు. గతంలో సిరులు పండించిన మిరపసాగుకు నేడు కనీసం పెట్టుబడి కూడా దక్కడం లేదు. దీంతో పల్నాడు రైతులు మిరప పంట వైపు వెళ్లడానికి ఆలోచిస్తున్నారు. ఫలితంగా ఈ ఏడాది మిర్చి సాగు అమాంతం పడిపోనుందని అధికారులు భావిస్తున్నారు. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు ఖరీఫ్‌లో జిల్లావ్యాప్తంగా 57 వేల హెక్టార్లలో మిర్చి సాధారణ సాగుగా ప్రకటించినప్పటికి కనీసం 35 వేల హెక్టార్లలో సాగు కూడా కష్టమేనని అభిప్రాయపడుతున్నారు. గతేడాది ఖరీఫ్‌లో మిరప పంట సాగు చేసిన రైతులకు పెట్టుబడి రాకపోగా రూ.లక్షల్లో నష్టపోయారు. ఓ వైపు తెగులు సోకడం, మరోవైపు పెట్టుబడి ఖర్చు అమాంతం పెరిగడంతోపాటు దిగుబడి తగ్గింది. అరకొర వచ్చిన మిర్చిపంటను అమ్ముకుందామంటే ధరలు గతంలో ఎన్నడూలేనివిధంగా పతనం అవ్వడంతో తీవ్ర ఇబ్బంది ఎదురైంది. కొందరు రైతులకు పెట్టుబడి కాదుకదా కనీసం కూలీ, రవాణా ఖర్చులు కూడా రాని దుస్థితి.

మిరప విత్తనాలకు డిమాండ్ నిల్

వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఖరీఫ్ వ్యవసాయ కార్యక్రమాలు మందకొడిగా నడుస్తున్నాయి. వర్షాలు పూర్తిస్థాయిలో కురవకపోవడంతో పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటున్నా యి. దీంతో నారుపోయడానికి రైతులు వెనుకాడుతు న్నారు. సాధారణంగా మే చివరి నుంచి జిల్లాలోని నర్సరీలలో మిరప నారు విత్తనాలు వేస్తారు. అయితే ప్రస్తుతం రైతులు మిర్చిసాగుకు వెనుకాడుతుండటంతో నర్సరీలు బోసిపోతున్నాయి. మరోవైపు గతంలో మిర్చి విత్తనాలకు విపరీతమైన డిమాండ్ ఉండేది. బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి ధరలను అమాంతం పెంచి రైతులను దోపిడీ చేసేవారు. అయితే ఈ ఏడాది మిర్చి విత్తనాలకు ఏమాత్రం డిమాండ్ లేక వ్యాపారాలు సాగడంలేదని వ్యాపారులు వాపోతున్నారు. ఈ ఏడాది జిల్లాలో సుమారు 1.52 లక్షల 10 గ్రాముల మిర్చి విత్తనాల ప్యాకెట్లు అవసరమని అధికారులు లెక్కకట్టారు. మరోవైపు రైతులు మిర్చి పంట సాగు వదలి ప్రత్యామ్నాయ పంటల వైపు చూస్తున్నారు. పత్తి, బొప్పాయి, కూరగాయలు, పండ్లతోటల వైపు ఆలోచిస్తున్నారు.

దగా చేసిన కూటమి సర్కారు

2023లో క్వింటా మిర్చి రూ.20 వేలకు పైగా అమ్ముడుపోగా గత ఖరీఫ్‌లో కనీసం రూ. 8 వేలు కూడా పలకని దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కొందరు రైతులు కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వ ఉంచారు. మంచి ధర వస్తుందని ఆశించిన వారికి నిరాశే ఎదురవుతోంది. ఆ రోజే అమ్మకొని ఉంటే కనీసం కోల్డ్ స్టోరేజ్ బాడుగ ఖర్చు అయినా మిగిలేదని బాధపడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఆశపడ్డ రైతులు దగాపడ్డారు. మిర్చి ధరల స్థిరీకరణ చేసి మద్దతు ధర ఇస్తుందని ఆశపడగా ప్రభుత్వం ఆదిశగా ప్రయత్నాలు చేయలేదు. దీంతో రైతులు నిండా మునిగి మిర్చి పంట అంటే భయపడే పరిస్థితికి వచ్చారు.



రెంటచింతలలోని ఓ నర్సరీలో మిర్చినారు (ఫైల్)

ఒక్క ఎకరం కూడా సాగు చేయలేను



గత సంవత్సరం ఆరెకరాలు మిర్చి పంట వేశాను. ఈ సంవత్సరం ఎకరం కూడా మిరప పంట సాగు చేయడం లేదు. దిగుబడి లేక ఒక వైపు.. మద్దతు ధర లేక మరోవైపు వరుస దెబ్బలు తగిలి కనీసం పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాలేదు. శ్రమ పోను చేతికి రూ.2లక్షల అప్పు మిగిలింది.

– బీరవల్లి రామిరెడ్డి, రైతు, జూలకల్లు గ్రామం, పిడుగురాళ్ల మండలం

రూ.5 లక్షలు నష్టపోయాను



గతేడాది ఐదు ఎకరాల్లో మిరప, రెండు ఎకరాల్లో పొగాకు సాగు చేశాను. మిర్చి ధర సరిగా లేకపోవడంతో రూ.5 లక్షల నష్టం వాటిల్లింది. పొగాకు సంగతి సరేసరి. ఈ ఏడాది మిర్చి సాగుచేయాలంటే ఆర్థిక ఇబ్బందులతో పాటు వాతావరణం అనుకూలించక, పరిస్థితులు సహకరించక ధైర్యం సరిపోవడం లేదు.

– బూచి అంజిరెడ్డి, మేళ్లవాగు, బొల్లాపల్లి మండలం.

మిర్చినారుకు డిమాండ్ లేదు



గతేడాది మిర్చి పంటలో వచ్చిన నష్టాలతో రైతులు మిర్చి సాగుకు ఆలోచిస్తున్నారు. గతంతో పోల్చితే ఈ ఏడాది మిర్చినారుకు డిమాండ్ తగ్గింది. ఇప్పటివరకు నారు పనులు పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం కూడా ఓ కారణం. మిర్చి నారుకు గతంలో లాగా డిమాండ్ లేకపోతే దానిపైనే ఆధారపడి ఉన్న నర్సరీ నిర్వాహకులు, కార్మికులు తీవ్రంగా నష్టపోతారు.

– గోపిరెడ్డి బాలారెడ్డి, నర్సరీ నిర్వాహకుడు, రెంటచింతల

కొనలేక పొగ !



కేంద్రం వద్ద పొగాకు బేళ్లు

'పచ్చ'పాతంపై అభ్యంతరం

సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసిన వారికే ఎంపికైన తేదీలో పొగాకు కొనుగోలు జరుగుతుందని ప్రకటించిన అధికారులు, మెసేజ్‌లు రాకపోయినా కొందరి బేళ్లను కొనుగోలు చేస్తుండడంపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మెసేజ్‌లు రాకముందే కేంద్రంలో నాలుగు రోజులు 183 క్వింటాళ్ల కొనుగోళ్లు ఎలా జరిగాయని ప్రశ్నిస్తున్నారు. స్థానిక టీడీపీ ముఖ్యనేత సిఫార్సుతో వ్యాపారులకు మేలు చేస్తున్న అధికారుల తీరుతో, వాస్తవ రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రహసనంలా నల్లబర్లీ కొనుగోలు ప్రక్రియ

- రకరకాల ఆంక్షలు.. అక్రమాలు
- సందేశాలు రాకుండానే కొందరికి చెక్కులు.. కొనుగోళ్లు
- రెండే ధరలన్న ప్రభుత్వం.. మూడో ధర ప్రకటించడంపై అనుమానం
- మొత్తం కొనేలోపు ఖరీఫ్ దాటుతుందని రైతుల ఆందోళన

యడ్లపాడు: మార్క్‌ఫెడ్ ద్వారా నల్లబర్లీ పొగాకును కొనేందుకు జిల్లాలో మైదవోలు – వంకాయలపాడు పరిధిలోని స్పైసెస్ పార్కులో ఈనెల 20న జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. అయితే, ఈ ప్రక్రియలో కొన్ని లోపాలు, అక్రమాలు జరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తేమశాతం ఉండరాదని, చెక్కులో ఏఒక్క ఆకు, సూర చేర్చరాదని, ఇంటి వద్దే పొగాకు గ్రేడింగ్ చేయాలని, రైతుసేవా కేంద్రంలో నమోదై ఉండాలని, సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ విధిగా చేసుకోవాలని, షెడ్యుల్ ప్రకారంగా మొబైల్‌కు సందేశం వచ్చిన రోజే రైతు తమ ఉత్పత్తులను తేవాలని ఆంక్షలు విధించడం రైతులను ఆదుకోవడమేనా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొనేసరికి ఖరీఫ్ ముగిస్తే..!

అధికారిక లెక్కల ప్రకారం...జిల్లాలో 8900 మంది రైతులు 99వేల క్వింటాళ్ల పొగాకు సాగు చేశారని చెబుతున్నా, నమోదు చేసుకోనివారు ఇంకా ఉన్నారు. కంపెనీలు, వ్యాపారులకు వీరివద్ద సగం పొగాకును కొనుగోలు చేసినట్లు వ్యవసాయ అధికారులు వెల్లడిస్తున్నారు. రోజుకు 200 క్వింటాళ్లకు మించి కొనుగోలు చేయడం సాధ్యం కాదని కేంద్రం ప్రారంభ సభలోనే అధికారులు స్పష్టం చేశారు. మరి మిగిలిన సగం కొనుగోళ్లకు పట్టే కాలంలో ఖరీఫ్ సీజన్ ముగిసిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మూడో ధరపై అయోమయం

కేంద్రంలో ప్రస్తుతం పొగాకు నాణ్యత ఆధారంగా రూ.6వేలు (నాసిరకం), రూ.9వేలు (మధ్యస్థం), రూ.12వేలు (ఉత్తమ నాణ్యత)గా ధరలు నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ సైతం మొదట రెండు రకాల ధరలను ప్రకటించి, ఆ తరువాత మూడో ధరను తెరపైకి తీసుకురావడంలో ఆంతర్యమేమిటంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. కేంద్రానికి తెచ్చిన పొగాకులో అత్యధికంగా రూ.9వేల ధరకే కొనుగోలు చేస్తున్నారంటూ రైతులు చెబుతున్నారు. ఇప్పటి వరకు రూ.9వేలకు కొనుగోలు చేసిన చెక్కులను రూ.12వేలకు మార్చు చేయాలని, అప్పుడే తమ పెట్టుబడి నష్టం పోకుండా, అప్పుల నుంచి కొంత ఊరట లభిస్తుందని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వేగవంతం చేయాలి



వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 99వేల క్వింటాళ్ల పొగాకు ఉందని తెలిసింది. ఇందులో సగం కొన్నారని చెబుతున్నా.. ఇంకా 45,000 క్వింటాళ్లు రైతుల వద్ద ఉంది. ప్రభుత్వం కేంద్రం ద్వారా రోజుకు 200 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేస్తే కనీసం అర్నెల్లకు పైగా సమయం పడుతుంది. ప్రభుత్వం ఆలోచించి కొనుగోళ్ల వేగవంతం చేయడంతో పాటు, ఎక్కువ మొత్తంలో కొనేలా చూడాలి.

– వడ్డేపల్లి నరసింహారావు(రాజు), వైఎస్సార్ సీపీ యడ్లపాడు మండల అధ్యక్షుడు

రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోం



పొగాకు సాగు చేసినవారంతా కౌలు రైతులే. స్థానిక టీడీపీ నేత సిఫార్సు చేసినందుకు వ్యాపారులవి కొనడం వలన సన్న, చిన్నకారు రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలి. నాణ్యతా ప్రమాణాల పేరుతో కఠిన నిబంధనలు లేకుండా నిర్ణయించిన ధరలకే పొగాకును కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

– వై.రాధాకృష్ణ, కౌలురైతు సంఘం, రాష్ట్ర అధ్యక్షుడు

డ్రగ్స్‌తో జీవితాలు దుర్భరం



నరసరావుపేటలో చేపట్టిన వాకథాన్‌లో కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, అధికారులు

- మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై నరసరావుపేటలో వాకథాన్
- పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే, విద్యార్థులు

నరసరావుపేట: సమాజ హితం కోసం మాదక ద్రవ్యాల వినియోగం, రవాణాకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌కుమార్, జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పల్నాడురోడ్డులోని ఏరియా హాస్పటల్ నుంచి కలెక్టరేట్ సమీపంలోని పరేడ్ గ్రౌండ్స్ వరకు వాకథాన్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నివారణ సమష్టి కృషి ద్వారానే సాధ్యమవుతుందన్నారు. సరదాగా మొదలై, చివరకు బానిసలుగా మార్చి జీవితాలను సర్వనాశనం చేస్తుందని హెచ్చరించారు. గంజాయి విక్రయించేవారు, సేవించే వారిపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారాన్ని 1972కు కాల్‌చేసి తెలియచేయాలని కోరారు. అనంతరం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. వాకథాన్‌లో డ్రగ్స్ వద్దు బ్రో అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డీఆర్‌ఓ ఏకా మురళి, ఆర్డీఓ కె.మధులత, ఏఆర్ అదనపు ఎస్పీ వి.సత్తిరాజు, ఏఆర్ డీఎస్పీ మహాత్మాగాంధీ, డీఎస్పీ కె.నాగేశ్వరరావు, ఈగల్ ఎస్‌ఐ శామ్యూల్‌రాజు, కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు, నర్సింగ్ విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'జిందాల్' ప్లాంట్ సందర్శన

యడ్లపాడు: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన నేపథ్యంలో పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడు గ్రామ పంచాయతీ పరిధిలోని జిందాల్ వేస్ట్ ఎనర్జీ పవర్ ప్లాంట్‌ను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు గురువారం సందర్శించారు. సీఎం చంద్రబాబు శుక్రవారం జిందాల్ ఫ్యాక్టరీను సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో వారు జిందాల్ ఫ్యాక్టరీని సందర్శించారు. సీఎం హెలిప్యాడ్ గ్రౌండ్‌ను పరిశీలించి భద్రత చర్యలపై చర్చించారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ వి.సత్తిరాజు, నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

30న మెగా జాబ్‌మేళా

చిలకలూరిపేటటౌన్: ఈనెల 30వ తేదీ సోమవారం పట్టణంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు, మోడరన్ సంస్థల డైరెక్టర్ చేబ్రోలు మహేష్ తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి, శిక్షణశాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, మోడరన్ డిగ్రీ కళాశాల సంయుక్తంగా ఈమెగామేళాను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. స్థానిక ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లోని మోడరన్ డిగ్రీ కళాశాల కాంప్లెక్స్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్‌మేళా జరుగుతుందన్నారు. ఇందులో ఫ్లాస్క్ టెక్ సొల్యూషన్స్, గోదావరి ఆంధ్రా బ్యాంక్, మాస్టర్ మైండ్స్, దివి ఆగ్రోస్, స్కిల్ క్రాఫ్ట్, మెడ్‌ప్లస్ ఫార్మసీ వంటి 10 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. మేళాలో ఎంపికైన వారికి వారి విద్యార్హత ప్రకారంగా రూ.12 నుంచి రూ.35 వేలు వేతనం ఉంటుందన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ పూర్తి చేసిన 18 నుంచి 40 ఏళ్ల వయస్సు గలవారు పాల్గొనవచ్చన్నారు. ఇంటర్వ్యూకు తమ బయోడేటా, రెజ్యూమ్, విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ నకళ్లు, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలుతో హాజరుకావాలన్నారు. ఆసక్తి కలవారు ముందుగా https:// naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 91005 66581, 91602 00652, 77029 21219 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం

జిల్లా ఉద్యానశాఖాధికారి వెంకట్రావు

అమరావతి(అచ్చంపేట): జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు 8 మండలాలను ఎంపిక చేసినట్లు జిల్లా ఉద్యానశాఖాధికారి ఐ.వెంకట్రావు తెలిపారు. మండలంలోని మాల్లాదిలో గురువారం ఉద్యానశాఖ, వ్యాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త సహకారంతో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఉద్యానశాఖాధికారి మాట్లాడుతూ అమరావతి మండలంలోని మల్లాదిలో 10 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు చేపట్టడం జరిగిందన్నారు. రైతులకు ఒక హెక్టార్‌కి 150 మొక్కలు చొప్పున విదేశీ మొక్కలకు ఒక్కొక్క మొక్కకు రూ.193, దేశీయ మొక్కకు రూ.133 చొప్పున రూ.29,000 రాయితీ ఇవ్వనున్నట్లు చెప్పారు. సాగు ప్రోత్సాహంలో భాగంగా హెక్టారుకు 50శాతం రాయితీపై నాలుగు సంవత్సరాలకు రూ.21000లకు మించకుండా రాయితీ ఇవ్వనున్నామన్నారు. అమరావతి మండలం ఆయిల్ పామ్ సాగుకు అనుకూలంగా ఉంటుందని వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ లిమిటెడ్ ఏరియా మేనేజర్ యం.నవీన్ తెలిపారు. నియోజకవర్గ ఉద్యానశాఖాధికారి ఎస్.సురేష్, డ్రిప్ ఇరిగేషన్ ఎంఐఏఓ మోషే నాయక్, గ్రామ ఉద్యానవన అసిస్టెంట్లు, వ్యవసాయ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖాధికారి

క్లుప్తంగా

జిల్లాలో 156.6 మి.మీ వర్షపాతం

నరసరావుపేట: జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో 156.6 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు వాతావరణ అధికారులు గురువారం పేర్కొన్నారు. అత్యధికంగా మాచర్లలో 38.6 మి.మీ వర్షం పడగా ఏడు మండలాల్లో అసలు వర్షమే పడలేదని వెల్లడించారు. వెల్దుర్తిలో 5.4 మి.మీ, దుర్గి 15.8, రెంటచింతల 20.4, గురజాల 14.2, దాచేపల్లి 3.0, కారెంపూడి 0.6, పిడుగురాళ్ల 2.4, మాచవరం 2.2, బెల్లంకొండ 8.6, అచ్చంపేట 9.0, క్రోసూరు 8.2, అమరావతి 8.4, పెదకూరపాడు 4.2, సత్తెనపల్లి 2.6, రాజుపాలెం 5.8, నకరికల్లు 1.0, బొల్లాపల్లి 3.4, వినుకొండ 0.8, ఈపూరు 1.4, యడ్లపాడు 0.6 మి.మీ వర్షం కురిసింది.

డ్రైవర్ల శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: స్థానిక ఏపీఎస్ఆర్టీసీ డిపో ఆవరణలోని డ్రైవర్ల శిక్షణ స్కూల్‌లో 20వ బ్యాచ్ శిక్షణకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావు గురువారం కోరారు. ఇప్పటివరకు 19 బ్యాచ్‌ల శిక్షణ విజయవంతంగా పూర్తయిందన్నారు. వచ్చేవారంలో 20వ బ్యాచ్ ప్రారంభం కానుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ శిక్షణ కార్యక్రమంలో చేరి నైపుణ్యం పొందవచ్చని తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఒక ఏడాది క్రితమే లైట్ వెయిట్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. శిక్షణ ఫీజు రూ.23వేలుగా నిర్ణయించామని, ఆసక్తిగల అభ్యర్థులు 99592 25428 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వివాహితతో అసభ్య ప్రవర్తన

- పురుగుమందు తాగి వివాహిత ఆత్మహత్యాయత్నం
- ముగ్గురిపై కేసు నమోదు

అమరావతి: మండల పరిధిలోని అత్తలూరులో యువతితో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో ముగ్గురిపై అమరావతి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం అత్తలూరు బీసీ కాలనీకి చెందిన వివాహితతో అదే కాలనీకి చెందిన టి.యోగీంద్ర, బి.అంకమ్మరాజు, బి.పోతురాజులు అసభ్యంగా ప్రవర్తించారు. ఆ సమయంలో ఆమె భర్త రావటంతో ముగ్గురు అక్కడి నుంచి పారిపోయారు. దీనిపై తీవ్ర మనస్థాపం చెందిన వివాహిత పురుగులమందుతాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబసభ్యులు గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. అసభ్యంగా ప్రవర్తించిన ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసి గురువారం అదుపులోకి తీసుకున్నామని సీఐ అచ్చియ్య తెలిపారు.

అదే.. గమ్మత్తు!

నకిలీ మందుల అడ్డాగా నరసరావుపేట

- విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు
- అడ్డగోలుగా నకిలీ మందుల తయారీ
- రాష్ట్రంలో మొదటి గంజాయి చాక్లెట్లు పట్టుబడింది నరసరావుపేటలోనే..
- సిండికేట్‌గా నకిలీ మందుల విక్రయాలు
- నకిలీ మందులు ఎక్కడ దొరికినా మూలాలు పల్నాడు జిల్లా కేంద్రంలోనే..
- పేరుకే ఆపరేషన్ గరుడ
- మామూళ్ల మత్తులో అధికారులు
- డ్రగ్ సిండికేట్ చెప్పిన వారికే డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టు!


నరసరావుపేటలో రూ.లక్షల విలువచేసే అనధికార ఔషధాలు సీజ్ చేసిన ఆపరేషన్ గరుడ టీం (ఫైల్)

నరసరావుపేట టౌన్: నకిలీ మందులు ఎక్కడ దొరికినా దాని మూలాలు నరసరావుపేటలోనే.. రాష్ట్రంలో మొదటిసారిగా గంజాయి కలిగిన చాక్లెట్‌లు పట్టుబడిందీ నరసరావుపేటలోనే.. వర్తక, వాణిజ్య, విద్యకు పేరెన్నికగన్న పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట గంజాయి అడ్డా మారుతోంది. ప్రముఖ కంపెనీల మాత్రల నుంచి సిరప్‌ల వరకు ఏమాత్రం తేడా లేకుండా నకిలీలను ఇక్కడ అక్రమార్కులు తయారు చేసి ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇంతజరుగుతున్నా అడ్డుకోవాల్సిన అధికారులు మిన్నకుండిపోతుండడంతో అక్రమార్కులు, గంజాయి బాబులు చెలరేగిపోతున్నారు. పట్టణంలో 'ఆపరేషన్ గరుడ' పేరిట చేస్తున్న దాడులు నామమాత్రంగానే ఉంటున్నాయి. పల్నాడు జిల్లాలో కేవలం రెండు చోట్ల మాత్రమే ఈగల్ టీం తనిఖీలు చేయడం ఇందుకు నిదర్శనం. నిజంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు జరిపి ఉంటే ఇంకా ఎన్నో అక్రమాలు వెలుగులోకి వచ్చేవి.

రూ.18.40 లక్షల విలువైన ఔషధాలు స్వాధీనం

నరసరావుపేటలో ఈ ఏడాది మార్చి 21న గరుడ బృందం దాడులు నిర్వహించారు. పల్నాడు జిల్లా డ్రగ్స్ కంట్రోల్ అధికారి డి.సునీత ఆధ్వర్యంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌లు మంగమ్మ, పద్మ, విజిలెన్స్ ఏఈఈ శివ నారాయణ, ఎఫ్ఆర్‌ఓ సైదులు, సీఐ పి.రామకృష్ణ పట్టణంలోని బరంపేటలో గల భవ్యశ్రీ మెడికల్ దుకాణానికి సంబంధించి భారీ స్థాయిలో ఔషధాలను ఆ లైసెన్సుడ్ గోదాంలో నిల్వ ఉంచినట్టు గుర్తించారు. దీంతో అక్కడ తనిఖీలు చేపట్టి రూ.18.40లక్షల విలువైన నకిలీ ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. ఇక మిగిలిన దుకాణాల్లో తనిఖీ చేయకుండా మమ అనిపించారన్నా ఆరోపణలు ఉన్నాయి. మిగిలిన దుకాణాలు, గోడౌన్లలో కూడా దాడులు చేసి ఉంటే పెద్దమొత్తంలో నకిలీలు పట్టుబడేవని స్థానికంగా చర్చ జరిగింది.

800 దుకాణాలు.. నాలుగే కేసులు

డ్రగ్ కంట్రోల్ అధికారులు చెప్పిన ప్రకారం గత 16 నెలల్లో జిల్లాలో 800 మందుల దుకాణాల్లో తనిఖీలు చేసినట్టు చెబుతున్నారు. అయితే కేసులు మాత్రం కేవలం నాలుగే నమోదు కావడంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అలా అయితే దుకాణాలన్నీ నిబంధనల ప్రకారమే నడుస్తున్నాయా? లేక అక్రమాలను కనుగొనడంలో అధికారులు విఫలమయ్యారా! అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

ప్రజల ప్రాణాలతో చెలగాటం..

పల్నాడు జిల్లాలో లైసెన్స్‌లు లేకుండా మందుల దుకాణాలు నడిపే ఆర్ఎంపీలు విస్తరించారు. ఇటీవల ఈపూరు, పెదకూరపాడు మండలాల్లో జరిగిన ఘటనలు ప్రజల ప్రాణాలను ఎలా ప్రమాదంలోకి నెట్టుతున్నాయో తేటతెల్లం చేస్తున్నాయి. వాస్తవానికి అధికారుల దృష్టి సారిస్తే అక్రమాలను అడ్డుకట్ట వేయవచ్చు. కొందరు ఆర్ఎంపీలు పెద్ద పెద్ద చికిత్సలు అందిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. అనధికారకంగా ఔషధ దుకాణాలు నిర్వహిస్తూ గడువు తీరిన మందులు, ఫిజిషియన్స్ శాంపిల్స్‌లను రోగులకు అంటగడుతున్నారు. అలాగే వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా యథేచ్ఛగా మెడికల్ షాపుల్లో మందులు విక్రయాలు చేస్తున్నారు. అనధికారికంగా విక్రయిస్తుండటంతో వాటిని కొంత మంది మత్తు పదార్థాలుగా వినియోగిస్తున్నారు.

ట్రెమడాల్ దొరికింది ఇక్కడే...

రెండేళ్ల క్రితం ఇదే నరసరావుపేట సమీపంలోని ఓ ఫార్మా కంపెనీలో ట్రెమడాల్ తయారీ వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం ఆ కంపెనీలో ఏం జరుగుతుందన్న అంశంపై ఈగల్ టీం దృష్టి సారించలేదు. చాలా బ్రాండెడ్ కంపెనీల మందులు ఇక్కడే నకిలీ తయారుచేశారని పుకార్లు వచ్చాయి. అధికారులు తనిఖీలు చేయకపోవడంపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నకిలీ మందుల తయారీ కేంద్రంగా నరసరావుపేట నిత్యం పలు వార్తలు వెలుగులోకి వచ్చినా అధికారులు మౌనం వహించటం అనుమానాలకు బలాన్ని చేకూరిస్తుంది.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎంపిక కూడా వారిదే?

రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా భారీ సంఖ్యలో నరసరావుపేటలో మాత్రలు సరఫరా చేసే డీలర్లు అధికంగా ఉన్నారు. మందుల ఏజెన్సీలు నడిపే కొందరు సిండికేట్‌గా తయారై అంతా వారి కనుసన్నల్లోనే అక్రమ వ్యవహారాలను చక్కపెడుతుంటారు. లాభాల కోసం బ్రాండెడ్ కంపెనీలు పోలి ఉండే నకిలీ ఔషధాలను ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ఇక్కడ డీలర్లే రాష్ట్రస్థాయిలో శాశిస్తుంటారు. జిల్లాలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎవరు ఉండాలో వీరే నిర్ణయిస్తారనే ఆరోపణలు లేకపోలేదు. అందుకే అధికారులు కూడా స్వామి భక్తిని చాటుకుంటూ సాధారణ తనిఖీలు కూడా చేయరన్న విమర్శలు లేకపోలేదు.


ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లు (ఫైల్)

దుర్గమ్మకు ఆషాఢ సారె


అమ్మవారి ఉత్సవ మూర్తిని ఊరేగింపుగా తీసుకువస్తున్న ఆలయ ఈఓ, అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవస్థానం తరఫున ఆలయ ఈఓ శీనానాయక్ దంపతులు దుర్గమ్మకు తొలి సారె సమర్పించారు. తొలుత ప్రధాన ఆలయంలోని మూల విరాట్‌కు, ఉత్సవ మూర్తికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధాన ఆలయం నుంచి ఉత్సవ మూర్తిని మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ మహా మండపం ఆరో అంతస్తుకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆరో అంతస్తులో వేదికపై దుర్గమ్మ ఉత్సవ మూర్తిని ప్రతిష్ఠించిన ఆలయ అర్చకులు పూజలు జరిపించారు. అనంతరం దేవస్థానం తరఫున ఆలయ ఈఓ శీనానాయక్ దంపతులు అమ్మవారికి పట్టు చీర, పసుపు, కుంకుమ, పూజా సామగ్రి, మిఠాయిలు సమర్పించారు. అమ్మ వారికి సారె సమర్పించేందుకు తరలివచ్చిన భక్త బృందాలు, భక్తుల కుటుంబ సభ్యులతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకుంది. సారె సమర్పించిన అనంతరం భక్తులు తమ బంధువులు, స్నేహితులకు తాంబూలాలు ఇచ్చి పుచ్చుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు లింగంభొట్ల దుర్గాప్రసాద్, వైదిక కమిటీ సభ్యుడు కోట ప్రసాద్ పూజా కార్యక్రమాలను నిర్వహించగా, ఆలయ ఏసీ సీహెచ్. రంగారావు, ఏఈఓలు ఎన్.రమేష్‌బాబు, వెంకటరెడ్డి, తిరుమలరావు, జంగం శ్రీనివాస్, కె.గంగాధర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ


మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య

మార్టూరు: దేశంలో ఐదు దశాబ్దాల క్రిందటి ఎమర్జెన్సీలో ప్రజలు, ఉద్యోగులు విద్యార్థులు, మేధావులు తదితర అన్ని రంగాలకు చెందిన వారు సంక్షోభాన్ని ఎదుర్కొంటే నేడు మోదీ పాలనలో అంతకంటే ఘోరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నామని జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో గంగయ్య మాట్లాడారు. 1975 జూన్ 25వ తేదీన అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి మేధావులు, ఉద్యోగులు, ప్రజల హక్కులు కాలరాశారన్నారు. కానీ ప్రస్తుతం మోదీ ప్రభుత్వంలో అప్రకటిత ఎమర్జెన్సీ విధించి.. అన్ని రంగాలను నాశనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల సంఘం, సీబీఐ, ఈడీ, తదితర రాజ్యాంగ వ్యవస్థలను నిష్పక్షపాతంగా వ్యవహరించకుండా తన గుప్పెట్లో పెట్టుకున్నారని తెలిపారు. దీనివలన రైతులు, కార్మికులు, ప్రజల హక్కులకు భంగం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉండగా సంస్కరణల బాట పట్టించాల్సింది పోయి వ్యవసాయాన్ని కార్పొరేట్ సంస్థలకు పాదాక్రాంతం చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మతం ప్రాతిపదికగా కేంద్ర ప్రభుత్వం ఆలంబిస్తున్న విధానాలను పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలు ఏకతాటిపై నిలిచి ఎదురుకోవాలని లేకుంటే గత ఎమర్జెన్సీ పాలన మించిన గడ్డు పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

'దారి తప్పుతున్న కూటమి ఏడాది పాలన' పుస్తకావిష్కరణ


పుస్తకం ఆవిష్కరిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్, నాయకులు

సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని పుతుంబాక భవన్‌లో సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రచురించిన 'దారి తప్పుతున్న టీడీపీ కూటమి ఏడాది పాలన' అనే పుస్తకాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు.

- విజయ్‌కుమార్ మాట్లాడుతూ మహిళలకు ఉచిత గ్యాస్ నగదు పడక ఇప్పటికీ బ్యాంకుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరుగుతున్నారన్నారు.
- తల్లికి వందనం మొదటి సంవత్సరం డబ్బులు వేయకుండా రెండవ సంవత్సరం వేశారని, అయినా కరెంటు బిల్లులు, కార్లు అని అనేక మందికి నగదు వేయలేదన్నారు.
- అంగన్‌వాడీలు, స్కీం వర్కర్లకు ప్రభుత్వ ఉద్యోగులనే పేరుతో వారికి కూడా నగదు వేయకపోవడం దారుణమన్నారు.
- గత ప్రభుత్వంలో స్మార్ట్‌మీటర్లు పెడితే పగలగొట్టమని నారా లోకేష్ పిలుపునిచ్చారని, కానీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇళ్లకు కూడా స్మార్ట్ మీటర్లు బిగించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు.
- కూటమి ప్రభుత్వం వచ్చి మోడల్ స్కూల్ పేరుతో 3,4,5 తరగతులను విడదీసి దూరంగా ఉన్న హైస్కూళ్లకు విలీనం చేయడంతో ఉన్న స్కూల్లో పిల్లల సంఖ్య తగ్గిపోయిందని, ఆ స్కూల్‌ను కూడా మూసివేసే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య, పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అనుముల లక్ష్మీశ్వర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ధరణికోట విమల, పెండ్యాల మహేష్, గుంటూరు మల్లేశ్వరి, గుంటుపల్లి బాలకృష్ణ, నాయకులు ఎం.హరిపోతురాజు, గుంటుపల్లి రజని, స్పందన, జడ రాజకుమార్, షేక్ మస్తాన్ వలి, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల రహిత సమాజ స్థాపనలో భాగస్వాములు కావాలి

ఆర్డీవో రామలక్ష్మి


రేపల్లెలో ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో రామలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాసరావు, విద్యార్థులు

రేపల్లె: మత్తు పదార్థాల రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని ఆర్డీవో నేలపు రామలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మాదక ద్రవ్యాలను సమూలంగా నిర్మూలించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. మాదక ద్రవ్యాలతో కుటుంబాలు నాశనమవ్వటంతోపాటు సమాజం పెడద్రోవ పడుతోందన్నారు. మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా పాఠశాల, కళాశాల విద్యార్థులు మాదక ద్రవ్యాలపై అవగాహన ఉండి వీటికి దూరంగా ఉండాలన్నారు. సమాజంలో తోటి వారికి వీటిపై అవగాహన కల్పించాలని కోరారు. ఏబీఆర్ డిగ్రీ కళాశాల నుంచి రింగు రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు, సీఐలు సురేష్‌బాబు, మల్లికార్జునరావు, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్, టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్, వివిధ కళాశాలల, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీపెట్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడలోని కేంద్ర పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్)లో టెన్త్ సప్లిమెంటరీలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ప్రత్యేక అవకాశం కల్పిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ) కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు జూలై 10వ తేదీలోపు దరఖాస్తు చేయాలని సూచించారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థినులు, విద్యార్థులకు వేర్వేరుగా హాస్టల్ వసతి ఉందన్నారు. నిబంధనలను అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫీజు రీ యింబర్స్‌మెంట్ సదుపాయం కలదని తెలిపారు. దరఖాస్తుతో పాటు ఇతర వివరాలకు 78935 86494 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

ఫెన్సింగ్‌లో సిల్వర్ మెడల్



సంతమాగులూరు (అద్దంకి రూరల్): వెల్లలచెరువు గ్రామానికి చెందిన జి.తన్మయ్‌శ్రీ ఏపీఎంఈ ఇంటర్నేషనల్ స్కూల్‌లో గురువారం జరిగిన గుంటూరు డిస్ట్రిక్ట్ ఫెన్సింగ్‌లో అండర్ 10 కేటగిరీలో ఫాయిల్ ఈవెంట్‌లో సిల్వర్ మెడల్ సాధించింది. ఈ నెల 29న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొననున్నట్లు కోచ్ తెలిపారు. తన్మయ్‌ని గుంటూరు జిల్లా సెక్రటరీ అశోక్‌బాబు, ఏపీఎంఈ స్కూల్ డైరెక్టర్ ఎన్. సౌగంధ్ కృష్ణ అభినందించారు.

చిన్నారులు పోటీతత్వం పెంచుకోవాలి


ఫెన్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న సౌగంధ కృష్ణ

గుంటూరు వెస్ట్ (క్రీడలు): చిన్నారులు క్రీడా సాధన ద్వారా పోటీతత్వాన్ని అలవరచుకోవాలని ఏపీఎంఈ స్కూల్ డైరెక్టర్ నందమూరి సౌగంధ కృష్ణ తెలిపారు. గుంటూరు ఫెన్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం గుంటూరు రూరల్ మండలం పొత్తూరులోని ఏపీఎంఈ స్కూల్ ప్రాంగణంలో జరిగిన అండర్-10, 12 బాలబాలికల జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో శారీరక పటుత్వానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి విద్యార్థి తనకు నచ్చిన క్రీడలో సాధన చేయాలని తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.అశోక్ బాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 50 మంది చిన్నారులు పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఎంపికైన వారిని ఈ నెల 29వ తేదీన విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు సౌగంధ కృష్ణ, అశోక్ బాబు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఛైర్మన్ డీఎస్ క్రిష్టోఫర్, పీఈటీ రాజేష్ ఇజ్రాయేల్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే...

- అండర్ 12 బాలుర విభాగంలో.. సాబర్ విభాగం: చైతన్య కృష్ణ, పృథ్వీ వినయ్, ఫాయిల్ విభాగం: ఇ.కౌశిక్.

బాలికల విభాగంలో.... సాబర్ విభాగం: ఆరోహి, హన్సిక, ఎప్పి విభాగం: జోష్నిక, లక్ష్మీ కార్తిక, ఫాయిల్ విభాగం: శ్లోక, హస్నా.

- అండర్-10 బాలుర విభాగంలో... ఫాయిల్ విభాగం: రిశాంక్, సంజయ్, ఎప్పి విభాగం: హర్షవర్ధన్. బాలికల విభాగంలో.. ఎప్పి విభాగం: దీక్షిత, తన్మయి శ్రీ.

వైద్యులకు క్రీడలతో ఉపశమనం


క్యారమ్స్ పోటీల్లో తలపడుతున్న వైద్యులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): వృత్తిపరంగా పెరుగుతున్న ఒత్తిడిని అధిగమించేందుకు వైద్యులు నిత్యం క్రీడా సాధన చేయాలని డాక్టర్స్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ (డీఎస్‌సీవో) కార్యదర్శి డాక్టర్ ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్థానిక గుంటూరు మెడికల్ అసోసియేషన్ భవన సముదాయంలో నిర్వహించిన క్యారమ్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పని ఒత్తిడిని అధిగమించడంతోపాటు ఆటవిడుపు కోసం ప్రతి ఏడాది వైద్యుల కోసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 29వ తేదీ వరకు భాగంగా క్యారమ్స్‌తోపాటు క్రికెట్, చెస్, కల్చరల్ విభాగాల్లో పోటీలు కొనసాగుతాయని చెప్పారు. సుమారు 50 మంది పేరొందిన వైద్యులు పాల్గొంటారని తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో డీఎస్‌సీవో అధ్యక్షుడు డాక్టర్ టి.సి. రెడ్డి తదితరులు పాల్గొన్నారు. క్యారమ్స్ పోటీలకు ఏపీ క్యారమ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ రిఫరీగా వ్యవహరించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

సంతమాగులూరు(అద్దంకి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. సంతమాగులూరు మండలం ఏల్చూరులో బుధవారం రోడ్డు ప్రమాదం జరగగా.. రవితేజ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని గుంటూరు వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ ఆ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందడంతో గ్రామంలో, కుటుంబంలో విషాదఛాయలు నెలకొన్నాయి. తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,400 గరిష్ఠం : రూ. 2,100

మోడల్ ధర రూ. 1,700

పసుపు ధరలు (గురువారం)



యార్డుకు వచ్చిన బస్తాలు : 596

కొమ్ములు : 361 బస్తాలు (ధర రూ॥ల్లో)

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,650	11,000	10,450

కాయలు : 235 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,650	10,500	10,400

మొత్తం అమ్మకాలు : 447 క్వింటాళ్లు

-దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం (గురువారం ధరలు)

వచ్చిన బస్తాలు	44,633
అమ్మకాలు	43,848
నిల్వ	10,563

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 - 13,000
నంబరు-5	రూ. 10,000 - 13,300
341	రూ. 10,000 - 13,200

నాన్ ఏసీ ప్రత్యేక రకం క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 - 13,500
బాడిగ - 355	రూ. 10,000 - 13,000
దేవనూరు డీలక్స్	రూ. 10,000 - 12,800
ఆర్మూర్	రూ. 9,800 - 11,000
తాలుకాయలు	రూ. 5,000 - 6,800

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 - 13,000
నంబరు-5	రూ. 10,000 - 13,400
341	రూ. 10,000 - 13,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 - 13,600
బాడిగ - 355	రూ. 10,000 - 13,000
తాలుకాయలు	రూ. 5,500 - 7,000

-కొరిటెపాడు (గుంటూరు)